


## నాలుగు దినాలు

- కవన శర్మ

"ఏటి బాబు! సొతంత్రం వొచ్చిందన్నారు. కామోసనుకున్నాం. గాంధీ, నెహ్రూ బాబుల పరిపాలనన్నారు. సీరామచందురుడే తిరిగి బూమ్మీద అవుతరించినట్టు రామరాజ్జెం తెచ్చేస్తారనుకుండిపోనాం... ఇంతలో గాంధీ బాబుని గుండేసి కాల్చీసినారు. తెల్లోడే గాంధీ బాబుని ఏటి సెయ్యనేక జైల్లో పెట్టి యెంటనే ఒగ్గేసినోడు. ఆడికి సేతకాని పని మనోల్లే నిముసంలో చేసేసినారు. ఆ పైన నెహ్రూ బాబే పొట్టిసీరాములు బాబుని పొట్టనెట్టుకున్నాడు. తెలుగుదేసం వొచ్చేసింది. ఒరేయ్ తెలుగు అప్పలకొండా నువ్వే ఇక రాజువిరా అన్నారు. నేనమ్మలా! కానీ సిన్న ఆశపడ్డాను. మునిసిపాలిటీలో సీపురుచ్చుకుని యీదులూడ్చే సీపరుద్యోగంలో నాకేటి పదవులిచ్చేత్తారు! ఇవ్వనేదు. సరే తెలుగు దేశం పార్టీ పవర్నోకి వచ్చింది అప్పుడు 'ఓరి! అప్పల కొండ నీకు యాభైపైన మరో అయిదొచ్చేసినాయిరా! ఇంక రిటేరు అయిపోరా' అన్నారు మూడేళ్ళముందే అయిపోనాను. సతంత్రం వచ్చిన, తెలుగు రాష్ట్రం వొచ్చేసినా, మొత్తం దేశమే వొచ్చేసినా ఏటి బాబు! పేదోడి బతుకులో మార్పేటుంటాది."

ఈ ఊసులాడుతున్న అప్పలకొండ నాకు సొయాన సిన నాయన. మా నాయనకి సొయాన తమ్ముడు. నాను పుట్టిన మూడేళ్ళకే మా నాయన ఏరాడ కొండ ఓడల్దారి దాటుతూ నావతోపాటు మునకేసేసాడు. మా సిననాయనే నాకు అయ్యా అన్నా! నాకంటే పదమూడో, పద్నాలుగో ఏళ్ళు పెద్ద. మా యమ్మ కంటే ఏడెనిమిదేళ్ళు సిన్న. మా యమ్మ దురగమ్మగారింటోను, మరో బామ్మలింట్లోను పాచిపని చేసేది. ఆదిబాబు కొట్లో పప్పులు, ఉప్పులూ బాగు సేసేది. నన్నూ మా సిన్నాయన్ని తనే సాకేది. ఇప్పుడో రేపో సొతంత్రం వచ్చుద్దనగా మా సిన్నాయన మా సిన్నమ్మని మనువాడి ఏరే ఎల్లిపోయాడు. నాకప్పుడు ఏడో ఎనిమిదో వయస్సు. మా సిన్నాయన పాటలు బాగాపాడేటోడు.

నాకో పాట గుర్తుంది. "ఏరాడ కొండ మీద సానున్నది. ఏగాణి డబ్బులకి రాన్నది." అంటూ పాడేవోడు. ఆ పాట నాను పాడుతుంటే "గుంటడ్ని సెడగొట్టకు" అంది మాయమ్మ మా అప్పలకొండ సిన్నాయనతో.

అదిగో ఆ మాటకి మా సిన్నాయన సింవాచలం కొండమీద నాగు పాంవులాగా బుస్సుమని కస్సుమని, సిన్నమ్మతో వేరింటికెళ్ళిపోనాడు. కానీ ఇప్పటికీ నానంటే ప్రేమే. అందుకే అప్పుడప్పుడు ప్రేమగా ఊసులాడటానికి వత్తాడు. ఏటేటో గుర్తు సేత్తాడు.

ఈ దినం మీరు నా మాటలాలకిత్తన్నారనో మరేటో గాని నా సిన్నతనమంతా కల్లముందు సినేమా నాగా ఆడ్తా ఉంది

ఆ మర్నాడు సొతంత్రం వచ్చేదినం. సొతంత్రం అంటే నాకేటి ఎరుక! ఏటీనేదు. సుబ్బరంగా ముసుగుదన్ని, సూరీడు కంట్లో పొడవకుండా తొంగుండిపోనాను. మా యమ్మ గొణుగుడు నాసెవుల పడతానే ఉంది.

"ఓరి సింవాసెలం. ఇంకా తొంగుండిపోనావ్రేటా! నెగు! నెగు! నెగరా అయ్యా! ఆదిబాబు కొట్టుకట్టుకొత్తానని ఆ బాబుకి సెప్పాన్నా.... ఏటి నెగుస్తావా, సెంబుడు నీల్లు దిమ్మరించేసేదా!" అమ్మ వార్నింగిచ్చేసింది. ముసుగు కొద్దిగా తొలిగించి సూద్దును కదా, వాల్టర్ టేసన్లోకి కలకత్తా మెయిల్ దూసుకొచ్చేసేటట్టు, సూరు కింద దూరి నోపలికి సెంబుతో వస్తాఉంది. టక్కున నేచిపోయి, మా యమ్మని తప్పించుకుని బయటపడి, గోలెం నోని నీల్లతో ముకం సేసేసి నోపలికి వొచ్చి అమ్మ ఇచ్చిన కాపీ చల్ల కాపీ ఓ గుక్కలో తాగేసి, గూట్నోంచి పైనా తీసి జుట్టుకి నీల్లు రాసి క్రాపు ఎగదువ్వి రెడీ అయిపోనాను.

ముందుగా నేను మా యమ్మ దురగమ్మగోరింటికెల్లినాంవు. అమ్మ తప్పేలాలు ముందేసుకుని కూకుంది. మా ఇంట్లో అన్నీ సిల్వర్ తప్పేలాలే! ఇయ్యింట్లో ఇత్తడి తప్పేలాలు, ఎండి కంచాలు, పింగాణీ బొచ్చెలు, ఎన్నో! నేను ఎగిరెగిరి బోరింగ్ కొట్టి నీల్లందిస్తావుంటే అమ్మ తప్పేలాలు తోమేసింది. అమ్మ సీపురట్టుకుని గదులూడ్సీడానికి రెడీ అయిపోతూంటే "ఒసే నూకాలూ! రేపు పద్దపండుక్కదే! ఇయ్యాల బూజులు దులిపి ఇల్లు కడిగి ముగ్గులెట్టే!" అంది దురగమ్మగోరు.

అమ్మ బూజుల కర్రందుకుని బూజులు దులుపుతుంటే నాను సీపురట్టుకుని కింద ఊడుత్తున్నాను. నాకు సీపురట్టుకోటంలో సులువులు మా సిన్నాయన సెప్పాడు. ఆ టయంలో దురగమ్మగోరన్నారుగందా!

"ఏటే నూకాలూ! నువ్వేమో సినదానివి. మీలోనేమో మారుమనువులున్నాయి! నువ్వు మరో మనువెల్లరాదా"అని.

"నా మారుటి మగడు, నా బొట్టెడిని కొడుకునాగా సూసుకోగలడా! వొయిసుదేవుందిలే తల్లీ! కల్లు మూసుకుంటే గడిసిపోద్ది" అంది. మాయమ్మకి నేనంటే పేనం! నాను ఊడిసిన గదుల్ని అమ్మని కడగమంది దురగమ్మగోరు. అమ్మ మాటాడకుండా కడుగుతావుంటే

"ఏటే నూకాలు! రైకేసుకోరాదుటే! వొయిస్సులో ఉన్నదానివి" అంది దురగమ్మగోరు. వంగుని కడుగుతున్న అమ్మ లేసి నిలబడి,

"అమ్మా! మీరు కంపెనీ బాడీలేసుకోరేం?" అని అడిగింది.

"సీ! నేనేం సినిమాదాన్నిటే" అంది ఆవిడ

"అమ్మా! పెల్లయేసరికి పదేను లేవు సరిగా పెల్లయిన మర్నాడే మా అత్తమ్మ మనం సాన్లం కామే కోడలా! రైకలేసుకుని సోకులు సేసుకోడానికి. పనీపాటల కెళ్ళేవోల్లం. కూసంత మగనాలినాగుండు` అంటూ మా అత్తమ్మ రైక తీయించింది" అంది అమ్మ. దురగమ్మగోరా దినం ఎందుకు ముకం అదోలా పెట్టిందో ఈ దినం నాకు తెలుసు.

ఆవిడ మరునాడు పండుగంటూ సానా సాకిరీ సేయించింది ఆ దినం, మా అంచేత. బామ్మర్ల ఇంటోను అంతే. అమ్మకి రెక్కలు గుంజేసినాయి.

అప్పుడు మా యమ్మ నన్ను ఆదిబాబుకి రాణాకొట్టుకట్టుకు పోయింది. ఆదిబాబు సాపుకి రంగు రంగుల కాయితాల జండాలు దారాని కంటించినయి సాపు సుట్టూ పనోడి సేత కట్టిత్తా ఉండాడు.

"కుర్రాడు మరీ పీలగా ఉన్నాడే! పనేటి సేత్తాడు" అన్నాడాదిబాబు నన్ను సూడగానే.

"పీలగా ఉన్నోల్లే సెలాకీగా పనిసేత్తారు. దిబ్బగున్నోల్లు పనేటి సేత్తారు!?" అంది మా అమ్మ. ఆదిబాబు బస్తా నాగా దిబ్బగుంటాడు. పనేటి సెయ్యడుగామోసు. అదిననట్టు,

"ఉప్పుడే సెప్పేత్తున్నాను. నా నీ గుంటడికి రోజుకి బేడ డబ్బులిత్తాను. నెల జీతం నేదు" అనేసినాడు. నాకు నోరూరిపోనాది.

"అమ్మా నేను జీల్లు, పిప్పలమెంట్లూ రోజూ కొనుక్కుతింటానే" అన్నాను ఆసగా. అమ్మ అది యినిపించుకోక,

"డబ్బులొద్దు, రోజూ కూలికి నూకలిచ్చి పంపించు" అంది

"బేడ డబ్బులికి రేసన్నోజుల్నో నూకలేటొత్తాయే" అన్నాడాదిబాబు.

"వచ్చినన్నే ఇయ్యి. అయినా రేపు సొతంత్రం వత్తుందంటగా. వచ్చినాక కూడా బియ్యం సేరారణాలకమ్మవా! దొంగసాటుగా రూపాయి పావలాకే అమ్ముకుంటావా! రేసనెత్తేరా. రేసనున్నా నెహ్రూ గాంధీ బాబులు దొంగయాపారం సేసేవోళ్లని జైల్లో ఎట్టేరా?" అంది అమ్మ.

"నూకాలు! నువ్వు కాంగిరేసులో సేరి మంత్రివైపోయి నన్ను పట్టిచ్చెయ్యి" అన్నాడు ఆదిబాబు.

"హాసికాలకేటి బాబు! గుంటడ్ని ఎప్పటి నుంచీ పన్లోకంపేది?" అనడిగింది.

"ఎవలూ కొని సచ్చేది లేదు. ఈ రెండు మూడు రోజులు. మొదటి తారీకు నుంచీ పంపు" అన్నాడాదిబాబు.

* * * *

"సోదర సోదరీమణుల్నారా! కొలాయి మూతల్నారా! సున్నప్పిడతల్నారా! రేపు సొతంతరదినం. "అంటూ మోహనుదాసు కరమ చందర గాందీ ఉపన్నాసం ఇత్తా ఉండాడు. దాసు దురగమ్మగోరి కొడుకు. నాయీడోడే! సుట్టూ తెలగాల పిల్లడు, గవర్ల పిల్లడూ, పెరికేల పిల్లడు కూర్సుని సప్పట్లు కొడతా ఉండారు.

"సివాసెలం! రేపట్నుంచీ నీకు సొతంతరమా! నీకొట్టంలేని పని సెయ్యనక్కర్నేదు." అన్నాడు దాసు.

"దాసూ! అయితే నేను ఆదిబాబు కొట్నోకి పనికిపోనక్కరనేదా! నాను నీలాగా బడికెల్లి సదూకోవచ్చా?" అని ఆసగా అడిగాను.

"ఆ సొతంతరం నీకుంది" అన్నాడు దాసు.

ఆ రాతిరి సరింగా అర్ధరాతిరికి, నాకు దాసుకి మాయమ్మకి సొతంతరం వత్తుందంట. నాకు నిద్దరపట్టనేదు. మా సిన నాయనొచ్చి "రేతిరికి పంపాన కోంసిలరు, విస్సినాదంబాబు, ఊల్లో ఇంకా పెద్దోల్లు డబ్బున్నోల్లు, దేసబత్తునోల్లు టపాకాయలు కాలుత్తారా. ఆల్లు ఇల్లా టపాకాయలు కాల్సిగానే అలా సొతంతరం వచ్చుద్ది. నెహురూబాబు ఢిల్లీలో కాంగిరేసు జండా ఎగరేత్తాడూ" అన్నాడు.

రాతిరి ధనాధనా టపాకాయలు మోగాయి. నా సిన్నప్పుడూ జపానోల్లు వేసిన బాంబులు సప్పుడు గుర్తుకొచ్చినయి. కానీ ఇప్పుడు బయం వెయ్యనేదు. సప్పుడు సంతోసమే!

పొద్దుటేల నెగిసినప్పటి నుంచీ వీదినోకి ఒప్పుడు పారొద్దరా అనే! మా యమ్మ నన్ను నేపనేదు. నేనే బేగినెగిసిపోనాను. పందుంపుల్లెట్టి ముకం సేసినాను. కాపీ బిల్ల, కాపీ తాగేసినాను. దాసు బాబిచ్చిన సొక్కా నాగు కొత్తయి, దాసుక్కాదు నాక్కొత్తయి యేసుకొని ఈదినోకి ఉరికినాను.

సెట్టు సెట్టుకీ, కొట్టు కొట్టుకీ, పూరింటికి మిద్దింటికీ ఆపీసులకు బళ్ళకి ఆకరికి పెద్దదరమాసుపత్తిరికి కూడా మూడు రంగుల జెండా, అదే ఆపాట నోది, 'తిరివర్నాంసితపతాకం' కట్టేసినారు. వోలిండియా రేడియో," ఉదయమ్మాయెను సేచ్చాబతము దయమ్మాయెనహో" అంటూ మోతెత్తిపోతా ఉంది. నా వొయిసుకుర్రాళ్ళందరు సొక్కా జేబీలకి అలిపిలో కాయితం జెండాలు, నెహురూ బాబు గులాప్పువ్వెట్టుకుంటాడే, ఆనాగెట్టుకుని తిరగేస్తున్నారు.

దాసు ఇంటికి లగెత్తుకెల్లి "నాకో జెండాయియ్యవా" అని అడిగాను. "అయిపోనాయిరా...ఆగాగు..." అంటూ లోపలికి వెళ్ళి కాయితం తెచ్చి రంగు బిల్లలు నీల్లలో కరగబెట్టి, కుంచెతో జెండాబొమ్మ ఏసి దాన్ని ఓ పుల్లకి అంటించి సేతిలో పెట్టేసినాడు. జేబులో సిన్నజెండానేకపోయినా ఇప్పుడు నా సేతిలో పెద్ద జెండాయే ఉన్నాది.

బల్లోకెల్లిన పిల్లలు లడ్డూలు, బిల్లలు తింటూ జెండా ఎగరేసి వత్తున్నారు. గవర్న కుర్రోడు నా సేతిలో సిన్నపిసరెట్టినాడు. ఆకలేసి ఇంటికెల్లేసరికి మాయమ్మ పనులు ముగించుకొచ్చినాది.

"నిన్న రెక్కలు గుంజీసినాపనిసేయించుకున్నా ఆకలెరిగిన దొరయిలు నీకూ నాకు పంచ బిచ్చపరమాన్నాలెట్టార్రా" అంది మాయమ్మ. మాయమ్మ ముకం జెండాలా ఎలిగిపోతా ఉన్నాది.

అదిగో అన్నాగ ఆ సొంతంతరదినం నానీనాటికి మర్సిపోనేదు.

నాకు సొతంతరం వచ్చినాది కదా! నా నూరుకోనేదు. అమ్మతో నా నాది బాబుకొట్లో సేరనని సెప్పి మా సిన్నాయన్ని నన్ను బల్లో సేర్సమన్నాను. మా సిన్నాయన, బాగుమల్లు సావుకారిల్లు దాటి మాంసం కొట్ల మీదుగా నన్నుతోలుకెల్లి, దుంపలబల్లో సేర్పించినాడు. దుంపలబడిలో తిండానికి మునిసిపాలిటీవోల్లు దుంపలిచ్చేవోరు. అయ్యారోజుల్లో ఒవరూ తినడం లేదుకానీ మా సిన్నప్పుడు సానామంది తినేటోల్లు. మా రుసిగా ఉంటాయి, సవగ్గా ఉంటాయి. అయికూడా ఉత్తినే, బల్లో ఇచ్చినట్టు, బయటొచ్చేరుకదా! దుంపల్తింటూ సదువుకోటం మొదలెట్టినాను. ఇంతలో బల్లకి దసరా సెలవలు ఆపైన దీపావలి సెలవలు, ఆపైన సంకురేతిరి సెలవలు అంటూ బడి సానా దినాలు సెలవలొచ్చేసినాయి. మళ్ళీ బడి తెరిసేనేదో దాసు, "సోదర సోదరీమణులారా! సున్నప్పిడతల్సారా! కొళాయి మూతుల్సారా! సోక వోర్త. గాందీగోర్ని గుండేసి కాల్చేసినారు" అన్నాడో సాయంతరం. దురగమ్మగోరు ఆ బాబుని సెడతిట్టారు. "నోటికి సుద్దీ బద్దీ ఉండాలి. గాందీబాబు నెవరు సంపుతార్రా. ఆయన దరమరాజు. సెత్రూలునేరు ఆయనకెవరు" అంది.

దాసు లోపలికెల్లి వోలిండియా రేడియో గట్టిగా పెట్టేసినాడు. అందులో సన్నాయిలు, పిడేల్లు కుక్కలు కూస్తున్నట్టు వోయిత్తున్నారు. మద్దెమద్దెలో ఇంగిలీసులో, ఇందీలో పెద్దోరు ఏదో అంటున్నారు.

"నిజమేరా దాసు. కలికాలం. మనోల్లేట కాల్చిసింది. తురకోల్లు కాదుట. చాంతంగా ఉండమంటున్నాది పెబుత్వం " అంది దురగమ్మ.

ఊరంతా ఎవరికి మటుకు వారింట్లోనే సెవం నెగిసినట్టు సోకాలెట్టేవోరు. కూడొండుకుని తినవోల్లు, మాకాలు ముడిసేసుకున్నోల్లు అయిపోనారు. ఇయ్యాల సాయింతరందాకా దర్జాగా కొయ్య సివర ఎగిరిన జండాలు మద్దెకి దిగిపోనాయి.

****

సాన్నాల్లు బల్లు మూసిసారు. సాపులు మూసేసినారు. ఏ కాంగిరేసోడు క్రలుబిచ్చుకొని మూయించనేదు! మినర్వాటాకీసునో గాందీగోరిని ఊరేగించి బూడిద చేసినప్పుడు తీసిన సినిమా, డబ్బు తీసుకోకుండా సూపించినారు. నానూ అమ్మా సూసాం. ఏం జనం! ఏం ఊరేగింపు. ఎల్లిపోనాడూ పెదబాబు సొరగానికెల్లిపోనాడు.

మళ్ళీ బల్లు తెరిసారో నేదో అమ్మకి ఊష్టం వొచ్చింది. వొంటిమీద గేనం నేదు. బడిమానేసి అమ్మని సూసుకుంటూ ఉండిపోనాను. మా సిన్నాయన మంచోడు. అన్నం, సారు అన్ని దినాలు మా సిన్నమ్మ సేత పంపించినాడు నా సదువు సంకనాకిపోనాది. నన్ను అదే తరగతిలో ఉంచేసినాడు పెద్దపంతులు.

"నేను సచ్చిపోయినా బావుండేది. మీ సిన్నాయన నిన్ను సూసుకునేవోడు" అని అమ్మ ఆ రోజు సోకాలెట్టింది.

"వొద్దే నాకు బడొద్దే నువ్వేకావాలే" అంటూ మర్నాడే నా అంతట నానే పోయి ఆదిబాబు కొట్లోసేరిపోనాను.

****

నాలుగేళ్ళు గడిసినట్టున్నాయి పొట్టిసేరాములు బాబు అన్నం నీల్లూ ముట్టుకోకుండా ఉపవాసం సేసి తెలుగు రాస్టం కోసం సచ్చిపోనాడు. రాజాజీ, నెహురూ కలిసి సంపేసారుట. గాంధీగోరు ఉపవాసం సేత్తే ఆయనకోరిందల్లా ఒప్పేసుకొనేవారుట, ఆ

బాబులిద్దరు. అదే సీరాములు బాబిసయంలో ససేమిరా అంటూ మొండికేసేసారు. దాంతో తెలుగోల్లు రెచ్చిపోనారు. కుర్రోల్లు స్టైయికులు సేసేసినారు.

"రాజాజీ పిలక ఆరనాల పరక" అంటూ అరుసుకుంటా రోడ్నంబటి పోనారు. ఏమాట కామాటే సెప్పుకోవాల మాయమ్మనో నన్నో దురగమ్మగోరు రూపాయి పావలా ఇచ్చి పోలీసోల్ల ఇల్లకి పంపేది. హెడ్డుగోరి బార్య ఒక సేరు బియ్యమిచ్చేది. తెచ్చి ఆయమ్మ ఇంట్నో పడేసేవోల్లం. రాజాజీబాబు ముక్కెమంత్రయినాక ఈజెస్ట్ర, రేగును ఎత్తి పారేసినాడు. దాంతో బియ్యం సేరు ముచ్చేకయి నెలతిరక్కుండా ఆరణాలపరకైంది. పూర్నా మార్కెట్టు నో అడిగినోడికి అడిగినంత బియ్యం. అంతమంచి రాజాజీ బాబు పొట్టి సీరాములు సచ్చి పోడనుకున్నాడో ఏటో. అంతకు ముందు సామీ సీతారాము ఇంకా ఎక్కువ దినాలుపవాసం సేసి బతికినాడు కదా! అన్నానే ఇది తుస్సుమని పోతాది అనుకున్నాడు. అవనేదు. మలబారు పోలీసుల్ని దింపినాడు. ఆల్ల ఇనపటోపీలు సూస్తుంటే బయం యేసిపోనాది కానీ సూడెంట్లు దిగిరానేదు. ఆల్లు కాల్సకమాన్లేదు. ఆల్లు కాలిస్తే ఈల్లు మరింత పేట్రేగిపోనారు. సివరికి నెహూరూబాబు దిగొచ్చినాడు. రాజాజీబాబు లొంగొచ్చినాడు.

తెలుగు రాష్టం సీరామనవమి సంబరాలంత. పందిళ్ళతో ఎల్లమ్మ జాతరంత సంబరంతో వచ్చింది.

"మా తెనుగు తల్లికి మల్లెపూదండ" అన్న పాట సెవులు రింగుమని మారుమోగేలా, మైకులెట్టి ఊరంతా పాడేసింది. కాని మా సిన్నాయన ఆ తరువాత సెప్పాడు ఆపాట రాసినాయన్ని సబలోకి రానీకుండా "నువ్వెవడవేస్" అంటూ పోలీసులు రెక్కట్టుకు ఈదిలోకీడ్చేసినప్పుడు, ఆ పాటరాసినోడు ఓడు బతికుండాల, అంతగోడిని మనం ఓ దండేసి గౌరవించాల అని వోరూ గుర్తెట్టుకోలేదుట.

తెలుగుతల్లి ఆ దినం సంతోసించిందా? నేక సనిపోయిన సీరాములు బాబుకోసం కాలిపోయిన కుర్రోల్లకోసం కన్నీరెట్టుకుందా? తెలీదు. ఆ దినం మర్సిపోనేక పోనాను.

ఆ తరువాత సానా జరిగాయి. తెనుగు రాష్టం వొచ్చాక తెలుగు సిఁవంపెకాసెంపంతుల్ని గద్దెదింపేసినారు. ఇస్సినాదంగోరు ఏటో అయిపోనారు. బానోజీరావు సెయిర్మనే అయిపోనారు. ఆపైన ఆరెవరండి బెజవాడ.. ఆయన ఆయన్దసలు నెల్లూరుట ఆయన మూన్నాల్లు రాజ్జెం ఏలాడు. బెజవాడని ఇసాక పట్టనం కాదని, రాజదానిని కర్నూలట్టుకుపోయి నోయినే గద్దెక్కేసినాడు. నాకు గానం అప్పటికి కూసింత వత్తా ఉండాది.

ఆ తరువాత సాన్నాల్లకి "ఊగరా! ఊగరా! ఉరికొయ్య కూగరా" అంటూ సిన్నకుర్రనాయాల్ల ఉద్దిరేకం కలిగించే పాటలు "బద్రం కొడుకో" అంటూ ఆల్ల జీవితాలకి బద్రతనేకుండా సేసేపాటలొచ్చాయి. ఆదిబొట్ల కైలాసాలు, వెంపటావు సత్తాలు పోనారు. సాంబసివరావు, బూసనం మేస్టర్లు ఎటోపోనారు. మా అప్పల కొండ సిన్నాయన ఆల్లకి కబుర్లు సేరేసేవోడని నీటుగాంకెరుకైంది. ఎరుకయ్యేసరికేటి మిగిలింది!

మా అప్పలకొండ సిన్నాయన రిటేరయినాక కనపడకుండాపోనాడు. మా మోహనదాసు కరమ సెందరగాందీ తుపాకీగొట్టాన్నముకుని అడవుల్నోకి ఎల్లిపోనాడాదినాల్లోనే.

మాసినమ్మ, నా తమ్ముల్ల నీ సెల్లెల్లనీ వోటేసుకుని బెంగటిల్లిపోనాది. మాయమ్మది జాలిగుండె "ఓసిసెల్లా!నా కొడుకు. నీ కొడుక్కాదుటే! నీకేరే ఇల్లెందుకే. వచ్చేసి మా దగ్గరే ఉండిపో! ఆడు, నాతోపాటు, ఆడిపెల్లాం పిల్లతోపాటు నిన్నూ నీ పిల్లల్నీ సూసుకుంతాడు. మనాడోల్లకి పాసిపనులు ఒప్పుడూ ఉంతాయి. అని తీసుకొచ్చేసినాది. నానప్పుడు మునిసిపాలిటీలో మా సిన్నాయనేయించిన సీపరుద్యోగంలో సీనియర్ని. మా సిన్నాయన పెద్దకొడుక్కి నా పరపతిలో సీపరుద్యోగం ఏయించాను.

దాసు బాబు కాటికెళ్ళిన దినం సచ్చిపోయిన దినానికి నాలుగో దినం. రెండోరోజున అడవుల్లో ఎదురు కాల్పుల్లో సనిపోయినోల్ల సెవాల్ని టీ.వీ.లో సూపించారు. రక్తం గడ్డకట్టి ఈగలు ముసురుతున్న సెవంగాందన్నారు. ఆ దినం దురగమ్మగోరిని పట్టడం మాతరంకానేదు. పెద్దోల్లు, బాలగోపాలబాబు, వరవరరావు బాబు, గద్దరు బాబు, సెలసాని పెసాదు బాబు, కిస్నాబోయమ్మ ముక్కలుగా కోసి పట్టేసిన దాసుబాబుని, గిల్లింటికి సేర్చినారు. ఈ దినం దాసుబాబుని సావులమందుం మీదుగా ఊరేగించి కాటికట్టికెల్లినారు. దురమ్మగోరింటి దగ్గర జనాలు పోటీలు పడి దండలేసారు. పై ఊల్లజనాలు రాకుండా పోలీసులు సేసిన ప్రెయిత్నాలు పలించనేదు. జనం అమాసనాడు సాముద్రం పొంగినట్టు పొంగిపోనారు. అతడింత జనం నడిసారు.

కట్టెలమీద బాబు నుంచారు. ఆ బాబు పెదాలు "చోదర చోదరీమనుల్నారా! కౌళాయి మూతుల్నారా! సున్నప్పిడతల్నారా! నా సెవంతో మీదారి నెవరూ మూయనేరు. ఏడవకండేడవకండి." అంతున్నాయని నాకనిపించింది.

దూరంగా మైకులో"తెలుగు వీరనేవరా!" అని పాటేస్తున్నారెవరో.

అక్కడో దిమ్మమీద మా అప్పల కొండ సిన్నాయన కూరుని ఊసులాడ్తున్నాడు. సుట్టూసేరిన కుర్రోల్లతో. సెప్పట్టం మర్సిపోనాను. మాసిన్నాయన పోలీసులకి కిందటేడు నొంగిపోనాడు. టి.వి.లో సూపించారు. మేం సిన్నాయన బతికున్నందుకు సంతోసించా. అయితే పెద్దోల్లు నొంగిపోతే మెచ్చి మేకతోలు కప్పినట్టు, మా సిన్నాయనకి కప్పనేదు. పైగా కోర్టుల్లో సిన్నాసితకా కేసులు ఓ అయిదింకా నడుస్తాఉన్నాయి.

"ఈ నోకంనో పవరెప్పుడు డబ్బున్నోడితే. అందుసేత, పెబుత్వం నడుపుతున్నది కాంగిరేసోల్లా, తెలుగు దేసం వోల్లా, బి.జె,పి. వోల్లా అన్నదికాదు. అల్లలో ఓర్రైనా ఆ గాందీ బాబైనా ఈ గాందీ బాబైనా మరో గాందీబాబైనా తుపాకీన్నమ్మినా, అయిపనే నమ్మినా, సంపకమానరు. ఎందుకంటే ఆల్లు బీదోల్ల తరపున నిలబడ్తారు. నోర్నేని వోల్ల తరపున వోదిస్తారు.

రేపటి దినం, ఉత్తి ఆంధ్రవొచ్చినా, ఉత్తరాంధ్రావొచ్చినా, తెలంగానా వొచ్చినా వాల్లదే రాజ్జెం. వాల్లమాటే సెల్లుది. వాల్ల బాసే సెబాస్. మన బతుకులు బాగుపడితే నా సెవులు తెగ్గోయండి"

మా అప్పలకొండ సిన్నాయన సీకిస్నపరమాత్మ నాగా గేనం బోదిస్తా ఉన్నాడు.

దాసుబాబు పేదోడి బతుకునాగా కాలి బుగ్గవుతున్నాడు. ఆ బుగ్గాడవటానికి సీపురట్టుకునినాను నిలబడిపోనాను.